


'క్రొత్తగా వచ్చిన జైలు సూపరింటెండెంటు రాఘవరావు గారు చాలా స్ట్రిక్ట్ ఆఫీసరు' అన్న వార్త ఆ ఓపెన్ ఎర్ జైలంతా ప్రాకిపోయింది. రాఘవరావుగారు ఆ వార్త విని చాలా సంతోషించారు. స్ట్రిక్ట్ ఆఫీసరే కాదు నిజాయితీ కల ఆఫీసరు అని కూడా వార్త ప్రాకించడం ఎలాగా? అని తెగ ఆలోచించారు.

అలా ఆలోచించగా.... లోచించగా.... చించగా.... చగా.... ఆయన ఆలోచనల్లో ఓ మెరుపు మెరిసింది.

అదేమిటంటే—

ఇంతకు మునుపు వున్న జైలు సూపరింటెండెంట్ గారికి గులాబి పూవులంటే అమితమైన ఇష్టం. అందుకని ఓ వంద గులాబి మొక్కలు తెప్పించి ఖైదీలచే నాటించేరు. మరి ఆ గులాబి తోట లోని పూవులను ఎవరు ఏం చేసుకొనేవారో పెద్దగా పట్టించుకో లేదాయన. ఆ తర్వాత అనతి కాలంలోనే ఆయన బదిలీ అయి వెళ్ళిపోయేరు. ప్రస్తుతం రాఘవరావు గారి ఆలోచనల్లోని మెరుపు సదరు 'గులాబీ' తోటే.

వెను వెంటనే జైలర్లనూ, డిప్యూటీ జైలర్లనూ సమావేశ పరిచారు, చర్చించారు.

"ఇకనుంచి ఆ గులాబీలు ఎవరూ కోసుకోవడానికి వీల్లేదనీ, వాటిని మా ర్కెట్లో అమ్మేసి, వచ్చిన డబ్బులు ఖజానాలో చలానా కట్టేసేయాలనీ" ఆర్డరు వేసేసారు. అలాగేనంటూ అందరూ తలలూపారు, అంతే—

నెల తిరిగే సరికి మూడువేల రూపాయల గులాబీలు అమ్మకమయ్యాయి. ఆ డబ్బును చలానా కట్టేసి, ఓ కవరింగ్ లెటరుకు ఆ చలానా రశీదును జత పరిచి సర్కారు వారికి పంపించారు, రాఘవరావు గారు. ఆరోజు నిజంగా తన నిజాయితీకి తనే నిండుగా, గర్వంగా నవ్వుకున్నారు.

* * *

సరిగ్గా పక్షం రోజుల తర్వాత ఓ ఉత్తరం సర్కారు వారినుంచి వచ్చింది. రాఘవరావు గారు ఆత్రంగా చదివారు. అందులో ఇలా వుంది....

"మీరు ఎంతో శ్రద్ధతో జైల్లోని గులాబీ పూలు అమ్మి ఆ డబ్బు ఖజానాలో కట్టడం నిజంగా హర్షించదగ్గ విషయమే. అయితే ఆ గులాబీ తోట ఎంత కాలం నుంచి పెంచినది వివరాలు తెలుపుతూ, మునుపు అమ్మిన గులాబీల డబ్బు అరియర్స్ కూడా పంపమని కోరడమైనది."

గావుకేక పెట్టబోయి నోరు తెరిచి అలా వుండిపోయారు రాఘవరావు గారు. ●

